క్లుప్తంగా

మంత్రులను కలిసిన జిల్లా పరిషత్ చైర్మన్లు



హరీశ్ రావును సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్

మంథని: సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీ హర్షిణి పలువురు మంత్రులను కలిశారు. మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, తన్నీరు హరీశ్ రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీలో చేరిన ప్రసన్నకుమార్



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రసన్న కుమార్

జ్యోతినగర్: బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ యువజన విభాగం అధికార ప్రతినిధి గోలివాడ ప్రసన్నకుమార్ ఆదివారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరగా, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థి, యువజనులు, బహుజనులకు బీఎస్పీ పార్టీలోనే న్యాయం జరుగుతుందని పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి దేవునూరి సంపత్ కుమార్, గడ్డం జీవన్, గుండేటి మహేందర్, అజయ్ కుమార్, సిలివేరి రవికుమార్, సతీశ్ పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యం



కాలనీవాసులతో కౌన్సిలర్

సుల్తానాబాద్: వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళతామని కౌన్సిలర్ గోట్టం లక్ష్మి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్,నాయకులు గోట్టం మహేశ్ ,స్వప్న, అంజయ్య , అమృత , ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు



ప్రధాని ప్రసంగం వింటున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్: భారత ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కీ బాత్ 100 ఎపిసోడ్‌ను బీజేపి నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్‌లోని మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీ శక్తి కేంద్రంలో 49, 50 బూత్‌లకు చెందిన అధ్యక్షులు ఈదునూరి శ్రీకాంత్, పల్లికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో మిట్లపల్లి సతీశ్, ఈదునూరి చిరంజీవి, సాయి, రమేష్, పల్లికొండ నర్సింగ్, జూల విజయ్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

'జక్కుల'కు శ్రమశక్తి అవార్డు



దామోదర్‌రావు

గోదావరిఖని: వినూత్న ఆలోచనలతో తమ విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబర్చిన ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో ఈపీ ఫిట్టర్ కం మెకానిక్ జక్కుల దామోదర్‌రావు శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. బెస్ట్ సింగరేణియన్ అవార్డు, రెండు సార్లు బెస్ట్ వర్క్‌మెన్ అవార్డు, కార్మిక రత్న అవార్డు పొందిన దామోదర్‌కు శ్రమశక్తి అవార్డుకు ఎంపికకావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు భారంగా టార్పాలిన్ల కొనుగోలు

- సబ్సిడీపై టార్పాలిన్ల పంపిణీ ఎత్తేసిన ప్రభుత్వం
- అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలం



ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

రామగుండం: అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేస్తున్నాయి. యాసంగి కోతల సమయంలో వాతావరణంలో వచ్చిన పెనుమార్పులు రైతుల్లో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రైతులు తమ పంట పొలాలను కోసి కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకునే సమయంలోనే అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు ఇంకా కోతలు పూర్తి చేయని రైతులు ఈదురుగాలులతో వరి పూర్తిగా నేలకొరిగి వడ్లు రాలిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొన్ని చోట్ల కాంటా ప్రారంభించలేదు. ఇటీవల అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవడంతో మళ్లీ ఆరబెట్టే ప్రక్రియ మొదటికొచ్చింది.

సబ్సిడీపై టార్పాలిన్ల పంపిణీ ఎత్తివేత

రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం అమలు చేసినప్పటి నుంచి వ్యవసాయశాఖ నుంచి రైతులకు అందించే వివిధ రకాల సహాయాలను ఎత్తేశారు. ముఖ్యంగా సబ్సిడీపై వ్యవసాయ ఉపకరణాలు, ట్రాక్టర్ల పంపిణీ, విత్తనాల పంపిణీ, ఎరువుల పంపిణీ, టార్పాలిన్ల పంపిణీలను నిలిపివేశారు. దీంతో రైతులకు అందాల్సిన సబ్సిడీ ఎత్తివేయడంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.

టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందిగా మారింది. ఆర్థిక పరమైన నష్టం సంభవిస్తుంది. ప్రస్తుతం వేసవి కాలమైనప్పటికీ గతంలో కేవలం ఆరబెట్టుకునేందుకు మాత్రమే టార్పాలిన్లు వాడే వాళ్లం. ఇప్పుడు అకాల వర్షాలతో ధాన్యంపై కప్పేందుకు కూడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

– దారవేణి తిరుపతి, రైతు, వినంపేట

టార్పాలిన్ల కొనుగోలుకు ఐదు వేల ఖర్చు



మా పొలంలో పండిన ధాన్యం ఆరబెట్టేందుకు మా ఇంట్లో టార్పాలిన్లు సరిపోయేవి. ఇప్పుడు అకాల వర్షాలతో పైన కప్పేందుకు కూడా హుటాహుటిన టార్పాలిన్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. గతంలో సబ్సిడీపై టార్పాలిన్లు అందుబాటులో ఉంచిన వ్యవసాయశాఖ ఇప్పుడు సబ్సిడీ ఎత్తివేయడంతో బహిరంగ మార్కెట్లో టార్పాలిన్లు కొనుగోలు చేయడంతో ఐదు వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది.

– కందుల రాయలింగు, ఎగ్లాస్‌పూర్, రైతు

రైతుబంధు అమలుతో సబ్సిడీలకు మంగళం



మండల పరిధిలోని 16 గ్రామాలలో 4,600 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సుమారు మూడు వేల మంది సాగు రైతులు ఉంటారు. వ్యవసాయశాఖ ద్వారా సేంద్రియ సాగును ప్రోత్సహించడంలో భాగంగా సబ్సిడీపై కేవలం జీలుగ విత్తనాలు మాత్రమే పంపిణీ చేస్తున్నాం. అకాల వర్షాల నుంచి రైతులు తమ ఉత్పత్తులను రక్షించుకునేందుకు టార్పాలిన్లు కొనుగోలు చేసుకోక తప్పడం లేదు.

– భూక్యా రాంబాబు, అంతర్గాం, ఏవో

ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు



ధర్మారంలో శోభాయాత్రలో పాల్గొన్న ఆర్యవైశ్యులు,మహిళలు

ధర్మారం: మండల కేంద్రంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల సందర్భంగా ఆర్యవైశ్యులు పాతబస్టాండ్ నుంచి ఆర్యవైశ్య భవనం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, ధర్మపురి దేవస్థానం డైరెక్టర్ జైన రాజమౌళి, మాజీ అధ్యక్షుడు జిడిగే కిషన్, లయన్స్ క్లబ్ చైర్మన్ ఎలగందుల అశోక్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటిపెల్లి ఈశ్వర్, వాసవీక్లబ్ అధ్యక్షుడు బండ శరత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్:మండల కేంద్రంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ మాత ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భజనలు, కీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. పూజారి అంబరీష్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షక్ష, కార్యదర్శులు యాంసాని రాఘవులు, కోలేటి అశోక్, ఎంపీటీసీ రావి సదానందం, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : పట్టణంలోని వాసవీ మాత ఆలయంలో ఆదివారం కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి, హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నూరి అశోక్ కుమార్, చకిలం మారుతి, కొమురవెల్లి భాస్కర్, కొల్లూరి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మంథని: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జయంతోత్సవాలను సందర్భంగా స్థానిక దేవాలయంలో నెల రోజుల నుంచి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదానం చేసారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు.



జ్యోతినగర్: పూజలు చేస్తున్న మహిళలు

జ్యోతినగర్: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనిలోని చిలుకలయ్య ఆలయ ఆవరణలోఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అంజయ్య, గౌరవ అధ్యక్షులు ఈశ్వర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ కన్యకా పరమేశ్వర ఆలయంలో ఆదివారం వాసవి మాత జయంతి సందర్భంగా ఆలయంలో అర్చకులు నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన, అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకి అన్నదానం చేశారు.

అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రత్నం



నియామక పత్రం అందుకుంటున్న రత్నం

ఓదెల: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన మాటూరి రత్నం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర నాయకుడు జేబీ రాజు ఆదివారం తెలిపారు తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకుడు జేబీ రాజు, అధికార ప్రతినిధి అయిలయ్యకు రత్నం కృతజ్ఞతలు తెలిపారు. రత్నం ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

సుల్తానాబాద్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఆదివారం సీఎం కేసీఆర్ సంతకం చేయడంపై సంఘం జిల్లా అధ్యక్షుడు కూనూరు సునీల్ హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు.

జెడ్పీచైర్మన్‌కు కృతజ్ఞతలు

మంథని: వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు మంథని మండలం ధర్మారం రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మారం లోని పోచమ్మవాగుపై వంతెన నిర్మాణంతో గద్దలపల్లి నుంచి ముత్తారం మండలం రామకృష్ణాపూర్ వరకు రహదారి నిర్మాణానికి నిధుల మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆదివారం టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి స్థలం పరిశీలించారు.

యువకులకు బుక్స్ అందజేత

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆదేశాలతో ఉచితంగా పుస్తకాలను సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం, జై తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు నల్లాల కనకరాజులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయినాత్,కాంతయ్య, అమరగాని సంపత్,సంబోజీ శంకరయ్య, గొడిసెల శ్రీనివాస్,నల్లాల మలయ్య,తదితరులు ఉన్నారు.


షరతులు లేకుండా ధాన్యం కొనాలి

మంథని: రైతుల పంటను కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు షరతులు విధిస్తున్నారని, ఏలాంటి అడ్డంకులు లేకుండా ధాన్యం సేకరణ జరగాలని కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మంథని మండలం కన్నాల, మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మంథని మండల అధికార ప్రతినిధి తోకల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి కూలర్, ట్యూబ్‌లైట్లు బహూకరణ

గోదావరిఖనిటౌన్: సింగరేణి ఓసీపీ–1 ఇంజినీర్ అర్.అరుణ్‌కుమార్ తన తండ్రి ప్రొఫెసర్ రామోజీ మురళీకృష్ణ జ్ఞాపకార్థం ఆదివారం స్థానిక పవర్‌హౌస్‌కాలనీలోని గ్రంథాలయానికి రూ.7వేల విలువగల కూలర్, ఎల్ఈడీ ట్యూబ్ లైట్లను అందించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌ను గ్రంథాలయాల పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం.భారతి, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 1997–98 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులంతా 25 ఏళ్లకు ఒకే చోట కలుసుకుని పాత జ్ఞాపకాలు, తీపి గుర్తులు నెమరు వేసుకున్నారు. గురువులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో బస్‌స్టాండ్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ జరుగుగుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు అచ్చె వేణు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

కాచాపూర్‌లో నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ధూళికట్ట వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు సంఘం సీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, సంఘం చైర్మన్ వేణుగోపాలరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కాల్వశ్రీరాంపూర్:మండలంలోని మొట్లపల్లిలో శ్రీలక్ష్మి గణపతి, సుబ్రమణ్యేశ్వర స్వామి, శ్రీసీతారామ చంద్ర స్వామి, శివాలయం నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనె శ్యాం, ఎంపీటీసీ కౌసల్య, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, పిఏసిఎస్ చైర్మన్ చదువు రాంచంద్రా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురేశ్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు

మంథని: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఆలయం నిర్మించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్వామి వారికి అభిషేకం, హోమం నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్‌రూరల్:సుల్తానాబాద్ మండలం అల్లీపూర్‌లో గౌడ కులస్తులు ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనంతో వెళ్లి స్థానిక పోచమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గామాత ఆలయంలో చండీ యాగం

గోదావరిఖనిటౌన్: స్థానిక జవహర్‌నగర్ దుర్గామాత ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం దుర్గామాత ఆలయంలో చండీ యాగం ఘనంగా నిర్వహించారు.కార్పొరేటర్ పాతిపల్లి లక్ష్మి ఎల్లయ్య, సంతోష్‌రావు దంపతులు చండీ యాగంలో పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా ఎదురుకోళ్లు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎదురుకోళ్లను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వస్తి పుణ్యాహవాచనం,అశ్వవాహనసేవ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయఅర్చకులు, నిర్వాహకులు,భక్తులు, గ్రామ

తెలంగాణ భరోసా సభ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభ ను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కోరారు. ఆదివారం బీఎస్పీ జిల్లా పార్టీ కార్యాలయంలో బహిరంగసభ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో బీఎస్పీ పాత్ర కీలకమేనన్నారు. ఈ ప్రాంత ప్రజలు అధికసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, శేషాద్రి, దుర్గయ్య, గోపాల్, రియాజ్, అరుణ, శారద, మధు, ప్రశాంత్, రవీందర్, లక్ష్మణ్ తదితరులున్నారు.

బీఎస్పీకి ప్రజల ఆదరణ

కాల్వశ్రీరాంపూర్:బడుగు బలహీన వర్గాల ప్రజలకు బీఎస్పీ పార్టీపై నమ్మకం పెరిగిందని అందుకే బీఎస్పీలో చేరుతున్నారని పెద్దపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పందిల్ల వార్డు సభ్యులు చిలుముల స్వరూప, కొమురయ్య నేతృత్వంలో పలువురు బీఎస్పీలో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల: హైదరాబాద్‌లో మే 7 ఆదివారం జరిగే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్రకార్యదర్శి దాసరి హన్మయ్య అన్నారు. మండలంలోని కనగర్తిలో ఆదివారం వివిధపార్టీల నుంచి 70 మంది బీఎస్పీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సాత్తూరి అనిల్, ఓదెలమండలం అధ్యక్షులు పల్లె ప్రశాంత్, నాయకులు మహేశ్, కాసర్ల శ్రీనివాస్, వంశీ, వహీద్ పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఎన్నిక

కనగర్తి బూత్ కమిటీ అధ్యక్షుడిగా పిట్టల శివ, ఉపాధ్యక్షుడిగా ఎమ్డీ రషీద్, ప్రధానకార్యదర్శులు పెండం కుమార్, దాసరి తిరుపతి, పట్నం మల్లికార్జున్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య తెలిపారు.

మూడో రోజుకు చేరిన కార్యదర్శుల దీక్ష



మౌనదీక్ష చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఓదెల:ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శులు భానుప్రసాద్, కిరణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, మీనా, నవ్య, రమేశ్, దిలీప్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్:పంచాయితీ కార్యదర్శుల ఉద్యోగాలు క్రమబద్ధీకరణ చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల్వ శ్రీరాంపూర్‌లో కార్యదర్శుల దీక్షకు మద్దతు తెలిపారు. కార్యదర్శులు మౌన దీక్ష చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు.

వినూత్న రీతిలో కార్యదర్శుల నిరసన

పాలకుర్తి:మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆదివారం వినూత్న రీతిలో తమ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మూతికి నల్లగుడ్డలు కట్టుకుని మౌనదీక్ష చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలి

జ్యోతినగర్: దేశ రాజధాని ఢిల్లీలో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హైదరాబాద్‌లోని నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం పట్ల వారు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆరెపల్లి రాజేశ్వర్, సోమ్లా నాయక్, వెంకటస్వామి, సంజీవరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

సుల్తానాబాద్: వడగళ్ల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని కౌన్సిలర్ చింతల సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కురిసిన వడగళ్ల వర్షానికి పంట పాడైపోయిందని, వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయిందని, నష్టపోయిన రైతులకు పంట నష్టం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కరీంనగర్‌కు తరలిన రేషన్ డీలర్లు

ధర్మారం: రేషన్‌దారుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో చేపట్టిన చలో కరీంనగర్ కార్యక్రమానికి ఆదివారం ధర్మారం మండలం నుంచి రేషన్ డీలర్లు తరలివెళ్లారు. రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు దొనికెన తిరుపతిగౌడ్, నాయకులు కల్లెం హన్మంతరెడ్డి, నార రమేశ్, సుంచు లలిత, దేవి పోచయ్య, ఎనుగు ప్రతాపరెడ్డి, బద్దం మోహన్‌రెడ్డి తదితరులు తరలివెళ్లారు.

ముగిసిన వేంకటేశుని కల్యాణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో టీటీడీ వేదపండితుల సమక్షంలో నిర్వహించిన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం ముగిసింది. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. వర్షం పడడంతో కల్యాణానికి హాజరైన భక్తులు ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్, తదితర ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.